క్లుప్తంగా

విద్యుత్ టవర్ల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న జీఎం వెంకటేశ్వరరావు

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ3 ఏరియాలోని ఓసీపీ1 డంప్‌యార్డ్‌పై ఏర్పాటుచేస్తున్న 22 మెగావాట్ల సోలార్ విద్యుత్‌కేంద్రం నుంచి వచ్చే విద్యుత్‌ను 132 కేవీ లైన్ టవర్ల నిర్మాణానికి గురువారం బొక్కలవాగు సమీపంలో ఆర్జీ3 జీఎం వెంకటేశ్వరరావు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ప్రాజెక్ట్ అధికారి ఎం.నరేందర్, ఎస్ఈ టీఎస్ ట్రాన్స్‌కో శ్రీనివాస్ కాంట్రాక్టర్ జాన్సన్ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాయదండిలో 'బలగం' సినిమా ప్రదర్శన


సినిమా తిలకిస్తున్న గ్రామస్తులు

రామగుండం: ప్రస్తుతం డిజిటల్ ప్రపంచంలో కనుమరుగవుతున్న మానవ సంబంధాలను మరోమారు గుర్తుచేస్తూ మానవ విలువలను కళ్లకుకట్టినట్లు చూపించిన 'బలగం' సినిమా ప్రజాధారణ పొందింది. ఈ నేపథ్యంలో అంతర్గాం మండల పరిధిలోని రాయదండి సర్పంచ్ ధర్మాజి కృష్ణ ప్రత్యేక చొరవతో బుధవారం రాత్రి గ్రామ నడిబొడ్డున ప్రొజెక్టర్ సహాయంతో 'బలగం' సినిమా ప్రదర్శించగా అధిక సంఖ్యలో గ్రామస్తులు హాజరై తిలకించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

రామగుండం: గోదావరిఖనిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటును హర్షిస్తూ గురువారం రామగుండంలో బీఆర్ఎస్ శ్రేణులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రామగుండం పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జిల్లాకేంద్రంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండడంతో రామగుండం పారిశ్రామిక ప్రజలకు అసౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం స్థానికంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుతో ఆస్తుల క్రయవిక్రయాలు, వివాహ రిజిస్ట్రేషన్లు సులభం కానున్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రతినిధులు దీటి బాలరాజు, ఇసంపెల్లి తిరుపతి, డాక్టర్ ముస్తాఫా, మాడిశెట్టి రవీందర్, గోపాల్ కరివేద శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంకవ్వ మరణం వృథా కాదు

సుల్తానాబాద్: ఏగోలపు ఎంకవ్వ మరణం వృథా కాదని సీపీఐ మావోయిస్టు డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. పాలకుర్తి మండలం రాణాపూర్‌కు చెందిన ఎంకవ్వ భూస్వాముల, దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి పీడిత ప్రజలకు భూములను పంపిణీ చేసిందని కొనియాడారు. పీడిత ప్రజలకు అండగా నిలిచి వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాటం చేసి సాధించిందని కొనియాడారు. అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబానికి అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు, ప్రజా సంఘాలకు, గ్రామస్తులకు, విప్లవ అభినందనలు తెలిపారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటని అభిప్రాయం వ్యక్తం చేశారు.

రాజకీయ క్రీడగా మారిన పేపర్ లీకేజీలు

సుల్తానాబాద్: పదోతరగతి పరీక్షా పత్రాలు, మొన్నటి టీఎస్‌పీఎస్సీ పరీక్షా పత్రాలు లీకేజీ బీజేపీ, టీఆర్ఎస్ రాజకీయ క్రీడగా మారిందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథాజిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్షలాదిమంది విద్యార్థులు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమైపోయిందని, లీకేజీలకు ప్రధాన సూత్రదారులు, పాత్రదారులు ఎవరో నిగ్గుతేల్చడానికి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు.

పోచమ్మ ఆలయ ప్రహరీ పనులు ప్రారంభం

కమాన్‌పూర్: మండలంలోని పెంచికల్‌పేటలోని పోచమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం పనులను గురువారం ప్రారంభించారు. యాదవ సంఘం అధ్యక్షుడు పల్లె నారాయణ, ఎంపీటీసీ ఉమ, ఉపసర్పంచ్ లింగాల కుమార్, బైరి అంజయ్య, పెగడ సతీశ్, భూమయ్య, కార్తీక్, పవన్ కల్యాణ్, సతీశ్ పాల్గొన్నారు.

నత్తనడకన మన బడి పనులు

- పిల్లర్ స్థాయిలోనే కొన్ని పాఠశాలల్లో పనులు
- గడువులోగా పనులు పూర్తయ్యేనా ?


కానంపెల్లిలో నత్తనడకన సాగుతున్న భవన నిర్మాణ పనులు

ధర్మారం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పనులు ప్రారంభించినా క్షేత్రస్థాయిలో నత్తనడకన కొనసాగుతూనే ఉన్నాయి. గతేడాది జూలైలో ప్రారంభమైన పనులు గడువులోగా పూర్తవడం కష్టమేనని పలువురు చర్చించుకుంటున్నారు. ధర్మారం మండలంలో 18 ప్రభుత్వ పాఠశాలలను మనఊరు మనబడి కార్యక్రమంలో అధికారులు తీసుకున్నారు. పాఠశాలల అభివృద్ధి కోసం ప్రారంభించిన ఈపథకాన్ని ప్రజాప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభించినప్పటికీ ఆది నుంచి ఇబ్బందుల మధ్య పనులు కొనసాగుతున్నాయి. 18 పాఠశాలల్లో పనులు ప్రారంభించగా కేవలం పత్తిపాక, ధర్మారం,కటికెనపల్లి పాఠశాలలో మాత్రమే 90 శాతం పనులు పూర్తయ్యాయి. సాయంపేట పాఠశాలలో 15 రోజుల క్రితమే పనులు ప్రారంభించారు. ఖానంపెల్లిలో ఇప్పటికీ పిల్లర్ లెవెల్ పనులు సాగుతున్నాయి. ప్రభుత్వం ఈ పనులను మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినప్పటికి పనులు పురోగతిలో ఎలాంటి మార్పులులేవు. 15 రోజుల క్రితం ఎంపీడీవో జయశీల ఆధ్వర్యంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మొదటి విడతలో చేపట్టిన పనులను మార్చినెలాఖరులోగా పూర్తిచేయాలని, మిగతా పాఠశాలల్లో ఏప్రిల్ 30, మే 31లోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అయినా ఇప్పటివరకు మండలంలో పత్తిపాక పెయింటింగ్ పనులు చేయాల్సి ఉండగా ధర్మారంలో టాయిలెట్స్ పనులు పురోగతిలో ఉన్నాయి. కటికనపల్లి పాఠశాలలో సైతం 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలలో పనులు పురోగతిలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. భవన నిర్మాణ పనులు చేయడంలో కాంట్రాక్టర్లు శ్రద్ధ చూపిస్తుండగా మిగతా పనుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులు మార్చి 31 నుంచి గడువును పెంచినా పనులు పూర్తిచేయడం అనుమానమేనని ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఆర్అండ్‌బీ శాఖకు పనులు అప్పగింత

మన ఊరు మనబడి పథకంలో ప్రభుత్వం చేపట్టిన పనుల నిర్వాహణను ఆర్అండ్‌బీ అధికారులుకు ప్రభుత్వం అప్పగించింది. అయితే కొన్నిపాఠశాలల్లో కాంట్రాక్టర్లు పనులు చేస్తుండగా మరికొన్ని పాఠశాలల్లో ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు పనులు చేపట్టారు. భవన నిర్మాణాలను యుద్ధప్రాతిపదిన పూర్తిచేస్తున్న కాంట్రాక్టర్లు మిగతా పనులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

గడువులోగా పూర్తయ్యేనా ..?

మార్చి నెలాఖరు నుంచి మే నెలాఖరు వరకు గడువు పెంచినప్పటికీ అధికారుల ఆదేశాలుఅమలయ్యేలా లేవనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునప్పటికీ క్షేత్ర స్థాయిలో ఆశించిన మేర పనులు జరగడం లేదు. కొన్నిపాఠశాల్లో ఇప్పటి వరకు 20శాతం పనులు పూర్తికాలేదు.

గడువులోగా పూర్తి చేయిస్తాం



ప్రభుత్వం విధించిన గడువులోగా మన ఊరు మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులు పూర్తిచేయించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఈక్రమంలో ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై సంబంధిత కాంట్రాక్టర్లతో చర్చిస్తున్నాం. అనుకున్న గడువులోగా పనులు పూర్తిచేయిస్తాం.
– ఛాయాదేవి, ఎంఈవో

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు


కమాన్‌పూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


రామగుండంలో పార్టీజెండాతో కౌశిక హరి, నాయకులు


జెండా ఆవిష్కరిస్తున్న మిట్టపల్లి సతీశ్‌కుమార్


మంథనిలో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్/ఓదెల/కమాన్‌పూర్/రామగుండం జ్యోతినగర్/మంథని/రామగిరి: పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో గురువారం బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రధాన కూడళ్ల, పార్టీ కార్యాలయాల్లో పార్టీ శ్రేణులు పార్టీజెండా ఆవిష్కరించారు. పార్టీ ముఖ్యనాయకులు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. అనంతరం పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటామని అందరితో ప్రతిజ్ఞ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ అవినీతిని ఎండగట్టాలన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం


మాట్లాడుతున్న వైనాల రాజు

కమాన్‌పూర్: బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలోఅభివృద్ధి చేసిందేమి లేదని కిసాన్ కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ వైనాల రాజు అన్నారు. మండలంలోని జూలపల్లి గ్రామంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. మండలాన్ని మూడు ముక్కలు చేసి ఏలాంటి అభివృద్ధికి నోచుకుండా చేసిన ఘనత పుట్టమధుదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పుట్టమధు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం జెడ్పీచైర్మన్‌గా ఉన్న మండలంలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు చూపించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్కహామీని నెరవేర్చలేదన్నారు. తహసీల్దార్ కార్యాలయం, కమాన్‌పూర్ జీపీలకు నేటివరకు పక్క భవనాలు లేవని అభివృద్ధి అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయంలో శ్రీధర్‌బాబు మండలంలోని ప్రతీగ్రామానికి తారురోడ్లు, ప్రతీ లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు, మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయించిన ఘనత శ్రీధర్ బాబుదేనన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధక్షుడు భూంపెల్లి రాజయ్య, ఎంపీటీసీ శేవ్వ శంకరయ్య, నాయకులు దాసరి శివ, పెండ్యాల రాజు, బొజ్జ సతీశ్, జంగిలి కుమార్, బూస తిరుపతి, శ్రీను లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల దీక్షలకు కాంగ్రెస్, బీజేపీ సంఘీభావం


సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

రామగుండం: అంతర్గాం మండలకేంద్రంలోని డబుల్ బెడ్రూం గృహ సముదాయంలో 2016లో ఎంపికచేసిన లబ్ధిదారులు రిలేదీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం లబ్ధిదారులు చేపడుతున్న దీక్షా శిబిరంలో కాంగ్రెస్, బీజేపీ మండల ప్రతినిధులు బైఠాయించి ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా రెండు పార్టీల ప్రతినిధులు పెండ్యాల మహేశ్, మాడ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రామగుండం ఎమ్మెల్యేకు ఇళ్ల గిఫ్ట్ ఇచ్చిన ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అర్హులైన ప్రతీ ఒక్కరికి డబుల్ బెడ్రూం గిఫ్ట్‌గాఇచ్చి ధాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. 2016లో గ్రామాల్లో డబుల్ రూం లబ్ధిదారులను డ్రాపద్ధతిలో ఎంపికచేసి ఇప్పుడు జాబితా చెల్లదనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా మొదట ఎంపికచేసిన వారికి గృహాలను కేటాయించి మిగతా గృహాలను డ్రా పద్ధతిలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వ నిర్ణయం మార్చుకోకుంటే ప్రజా ఉద్యమాలు తప్పవని స్పష్టంచేశారు. ఈ దీక్షలకు సంఘీభావం తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, కోల రామ్మూర్తిగౌడ్, ఆవుల గోపాల్‌యాదవ్, బొడ్డు లింగమూర్తి, మడ్డితిరుపతి, ముచ్చకుర్తి రమేశ్, బీజేపీ నాయకులు బోడకుంట సుభాశ్, మగ్గిడి సాగర్, కొదురుపాక దేవేందర్, నరేశ్, మాడ ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి


కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

ధర్మారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కంటివెలుగు' పథకాన్ని అర్హులైన ప్రతీఒక్కరు సద్వినియోగంచేసుకోవాలని ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అన్నారు. ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలోని రైతువేదిక భవనంలో గురువారం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటిచూపు సమస్యతో బాధపడుతున్న వారికి ఈ పథకం వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, సర్పంచ్ గందం వరలక్ష్మి, ఉపసర్పంచు మంద శ్రీనివాస్, వైద్యాధికారి గౌతమ్‌కుమార్, హెచ్ఈవో కల్లెం రాజారెడ్డి, ఎంపీవో రమేశ్, గందం నారాయణ, మిట్ట తిరుపతి పాల్గొన్నారు.

'కంటివెలుగు' పరీక్షలకు స్పందన

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్, చీమలపేట గ్రామాల్లో గురువారం నిర్వహించిన కంటి పరీక్షలకు గ్రామస్తుల నుంచి స్పందన లభించింది. చీమలపేటలో 156 మందికి పరీక్షలు చేసి 19మందికి అద్దాలు అందించగా, అబ్బాపూర్‌లో 172 మందికి పరీక్షలు చేసి 56 మందికి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, రత్నాకర్, ఇన్‌చార్జి ఖలీమొద్దీన్, హెచ్‌వీ వసంత, ఏఎన్ఎంలు సరిత, అరుణ, ఆశాలు, పాల్గొన్నారు.

మైక్రో ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

రామగిరి: ముత్తారం మండలంలోని హరిపురం, ఓడేడ్ ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ముత్తారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు మైక్రో ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాఠశాలల్లోని విద్యార్థులకు మైక్రో ఫైలేరియా వ్యాధి నిర్ధారణకు టాస్ త్రీ(ట్రాన్స్‌మిషన్ అసెస్మెంట్) సర్వేలోభాగంగా మైక్రోఫైలేరియా పరీక్షలు నిర్వహించారు. మండలం పరిధిలో ముగ్గురికి చేయగా ముగ్గురికి నెగెటివ్ రిపోర్ట్ వచ్చినట్లు ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శంకరాదేవి తెలిపారు కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ నీరజ్, సూపర్‌వైజర్స్ వీరేశం, లలిత, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, స్వామి, ఆశా వర్కర్లు సుజాత, సరిత, సునీత హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఏర్పాటు

ఎలిగేడు: మండలకేంద్రంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, జ్యోతిబాపూలే మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిచేందుకు ఉత్సవకమిటీని మండల అంబేడ్కర్ సంఘం నాయకులు కవ్వంపల్లి శ్రీనివాస్(బంగ్లా) ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జయంతి ఉత్సవకమిటీ గౌరవ అధ్యక్షుడిగా భూర్ల సత్యనారాయణ, అధ్యక్షుడిగా బాసంపల్లి రాజేశం, ఉపాధ్యక్షులుగా మండిగ శ్రీధర్, తాండ్ర శంకర్,రవి, రాపాక మనోహర్, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాస్, శంకర్, సంపత్,కోశాధికారిగా బాపు, సభ్యులుగా వినోద్, హరిబాబు, రాజు, రవి, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నూతన అధ్యక్షుడు బాసంపల్లి రాజేశం తెలిపారు.

పైప్‌లైన్ లీకేజీతో వృథాగా తాగునీరు



మంథని: మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణంలో అనేక లోటుపాట్లు భయపెడుతున్నాయి. పైపులైన్ లీకేజీతో చాలాచోట్ల వృథాగా నీరు రోడ్డువెంట పారుతోంది. గురువారం మంథని మున్సిపాలిటీ వెళ్లే దారిలో మిషన్ పైపులైన్ లీకవడంతో పెద్దఎత్తున రోడ్డువెంట నీరు పారింది. కేడీసీసీ బ్యాంకు, కూరగాయల మార్కెట్ వరకు నీరు ప్రవహించింది.

ఆధ్యాత్మికం

ఘనంగా శ్రీలక్ష్మీనృసింహుని రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహ స్వామీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కన్నుల పండువగా జాతర, రథోత్సవం నిర్వహించారు. ఈనెల 1న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలను స్వామివారి కల్యాణంతో పాటు ప్రతిరోజు ప్రత్యేక పూజలను ముతవల్లీ అర్చక బృంద పండితులుచేశారు. శ్రీలక్ష్మీసమేత యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆలయ వీధుల్లో శోభాయత్ర నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఆలయధర్మకర్తలు నరేశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బీజేపీ హైదరాబాద్ జగద్గిరిగుట్ట సీనియర్ నాయకులు జేకే.శేఖర్‌యాదవ్, ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు రథోత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర


శోభాయాత్రలో యువకుల బైక్‌ర్యాలీ


లద్నాపూర్ హనుమాన్ ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న బ్రాహ్మణులు

రామగుండం: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం హిందూవాహిని ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ ప్రాంగణం నుంచి ఎఫ్‌సీఐ క్రాసింగ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని బీజేపీ సీనియర్ నాయకుడు కౌశిక హరి, కార్పొరేటర్ కౌశిక లత జెండా ఊపీ ప్రారంభించారు. ఇదిలా ఉండగా ముస్లింల ఉపవాస దీక్షలు కొనసాగుతున్నక్రమంలో ముందస్తుగా ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణంలోని మజీద్ పరిసరాల్లోని హలీంషాపులను పోలీసులు బైక్ ర్యాలీ ముగిసేవరకు మూసివేయించారు. భద్రతా చర్యల్లో గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై శరణ్య, అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్, ఏఎస్సై సుదర్శన్, ప్రభాకర్‌రావు ఉన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

మంథని: మంత్రపురిగా పిలువబడే మంథనిలో హనుమాన్ చిన్నజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంథనిలో 14 హనుమాన్ విగ్రహాలు కొలువైఉన్నాయి. జయంతి సందర్భంగా ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు నిర్వహించారు. భక్తులతో హనుమాన్ ఆలయాలు సందడిగా కనిపించాయి. అన్నదానం నిర్వహించారు.

రామగిరి: మండలం పరిధిలో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకుల ప్రత్యేక పూజలు చేసి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయకమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా పడిపూజ


పూజలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: ఉత్తర నక్షత్ర పర్వదినం సందర్భంగా రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం రాత్రి పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు ఫలపంచామృతాలతో అభిషేకం చేశారు. వైద్య విష్ణు తన కుటుంబ సభ్యులతో కలిసి అద్దెంకి సారంగచారి గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడి పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్,సుధాకర్‌రావు,స్టాలీన్‌గౌడ్ ఈశ్వర్‌రెడ్డి, లింగమూర్తి, రాయమల్లు, నాగరాజు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భవానీ దీక్షా యజ్ఞసమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ


ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గోదావరిఖనిటౌన్: భవానీ దీక్షా యజ్ఞసమితి నిర్వాహకుడు సురేశ్ గురుభవానీ ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖని చౌరస్తాలోని పోచమ్మ ఆలయం ఆవరణలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్ గురుభవానీ మాట్లాడుతూ.. ప్రతీనెల పౌర్ణమికి నిర్వహించే విధంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భవానీ భక్తులు గూడెపు రమేశ్, పెద్దపల్లి రామస్వామి, సతీశ్, రాంబాబు, నరేశ్, రవి, సరస్వతీ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి విద్యానికేతన్‌లో కాన్వొకేషన్ డే



గాయత్రి విద్యానికేతన్ కాన్వొకేషన్‌డేలో చిన్నారులతో చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్

సుల్తానాబాద్: పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో ఈవిద్యా సంవత్సరం యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కాన్వొకేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ చిన్నారులను అభినందించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకుకాన్వొకేషన్ సర్టిఫికేట్లు ప్రదానంచేశారు. ఈ కార్యక్రమంతో చిన్నారులు ఒక కొత్త అనుభూతికి లోనయ్యారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ రజనీ, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియొద్దీన్, నందిని, రమ్య, శాంతలక్ష్మి, మల్లేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.